# బామ్మగారి అమెరికా ప్రయాణం

'అమంత.'



ఈ సమస్యని ఎలా విడదీయాలో ఎవ్వరికీ పాలు పోవటం లేదు. ఇంత ఉత్సాహంగావున్న పార్వతమ్మగారిని నిరుత్సాహపర్చడం ఎలా ? పోనీ ఆవిడ కోరిన ప్రకారం జర్పించాలంటే ఎలా సాధ్యం?

"ఏరా కుమార్ — ఇప్పుడు యిలా అయ్యిం దేమిట్రా ? అమ్మకి ఎలా నచ్చచెప్పాలిరా ?" కొడుక్కేసి చూస్తూ అడిగింది, తల్లి సువర్చల.

ఇంతకీ అసలు సంగతి చెప్పకుంటే, సమస్య ఏమిటో అర్థంకాదు. పార్వతమ్మగారు సువర్చల తల్లి. ఆవిడని అమెరికావచ్చి, ఓ సంవత్సరమైనా వుండమని అమెరికాలోవున్న పార్వతమ్మగారి కొడుకులూ, సువర్చల అన్నదమ్ములూ పదే పదే రాస్తూ వచ్చారు. ఆఖరిసారిగా, వాళ్ళు సువర్చలకి చాల నిష్ఠూరంగా వుత్తరం వ్రాశారు, సువర్చలకి వాళ్ళ అమ్మని పంపడానికి యిష్టంలేనట్లుగా. కాని తల్లిని ఒంటరిగా అంతదూరం. ఎలా పంపడం ? అది ఓ ప్రాబ్లెమ్‌గా వుండేది. ఇంతలో పార్వతమ్మ మనుమడూ, సువర్చల కుమారుడు అయిన కుమార్‌కి అమెరికా టూర్ ప్రోగ్రాం తగిలింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు, వాళ్ళ ప్రాబ్లెమ్‌కి పరిష్కారం దొరికిందని. వీసాలూ, పాస్‌పోర్టులూ రడీ అయ్యాయ్. టిక్కెట్లు రిజర్వేషన్‌కూడా అయ్యాయ్. ప్రయాణం యింక పది రోజులు వుంది. పార్వతమ్మగారు అమెరికా ప్రయాణపు ఏర్పాట్లతో నెల రోజులనుంచి హడావుడిగావుంది. కుమార్ మేనమామలకీ, పిల్లలకీ యివ్వవలసిన ప్రెజెంటేషన్స్ అన్నీకొని, కష్టమ్స్ రూల్సుకి అడ్డురాకుండా జాగ్రత్తగా పాకింగ్ చేశాడు. ఇంట్లో అంతా ఫారెన్ వాతావరణం చిందులు వేస్తోంది.

ఇంతలోకే వచ్చిపడింది, ప్రస్తుత సమస్య. కుమార్ టూర్‌ని వాళ్ళ ఆఫీసువాళ్ళు ఓ సంవత్సరం వాయిదా వేసి, అతని టికెట్ కాన్సిల్ చేశారు. కాబట్టి ఇప్పుడు పార్వతమ్మ ఒక్కర్తే వెళ్ళాలి. తోడు ఎవ్వరూ లేరు.

పార్వతమ్మకు మాతృభాష తెలుగు మాత్రం వచ్చు. చిన్నప్పుడు ఆమె తండ్రి నేర్పిన సంస్కృతం కొద్దిగా జ్ఞాపకం వుంది ఆమెకు. కాని ఆమె వెళ్ళ వలసింది అమెరికా. విమానంలో దగ్గరగా రోజున్నర ప్రయాణం చేయాలి. ఏది కావాలన్నా, అడగాలన్నా ఇంగ్లీషు విధిగా రావాలి. కాని పార్వతమ్మగార్కి ఇంగ్లీషు రాదు. ఆమెను ఒకర్తేని ఎలా పంపడం ? ఆమె ఎలా ప్రయాణం చేస్తుంది ? అదీ ప్రస్తుత సమస్య !

ప్రయాణం వాయిదా వేస్తే ఇంకేమన్నా ఉందా ? పాలపొంగు లాంటి ఆమె ఉత్సాహం మీద నీళ్ళు చల్లినట్లేగా— పైగా సువర్చలగారి అమెరికన్ సోదరులు ఊరుకుంటారా ? ఉత్తరాల యుద్ధం మొదలు పెట్టరూ ? అదీ సువర్చల సమస్య,

ఇంట్లో ఎవ్వరికీ బుర్రలు పనిచేయటం లేదు. పార్వతమ్మగారిని అమెరికా పంపాలి, సాయం ఎవరైనా వున్నా లేకపోయినా. అందరి ఆలోచనా అదే.

"అమ్మమ్మా — ఒక్క దానివీ ప్రయాణం చేయగలవా ? మామయ్యలకి ఫోను చేస్తే వాళ్ళు ఎయిర్ పోర్టుకి వస్తారు. నేను దగ్గర వుండి బొంబాయిలో ప్లేను ఎక్కిస్తా." కుమార్ అడిగాడు.

"వెడతామరా — ఆ మాత్రం ప్రయాణం చేయలేనా ?"

"ఏం బామ్మా — ఇది ఆర్టీసీ బస్సెక్కి కట్టమూరు వెళ్ళడం అనుకున్నావా ?" నవ్వుతూ అంది కుమార్ చెల్లాయి.

"అదేమిటే — ఇది మాత్రం ఏం కష్టం — ఇక్కడ ఎక్కి అక్కడ దిగడమేగా ?" అర్థంగాక అడిగింది, పార్వతమ్మ.

"అదికాదు బామ్మా— నీకు విమానంలో ఆకలి యిందనుకో— ఎలా అడుగుతావ్?" మళ్ళీ అడిగింది.

"యిలా అడుగుతా" సౌంజ్ఞలు చేస్తూ చూపింది పార్వతమ్మ.

'వాళ్ళు చేపకూర యిచ్చారనుకో - వద్దని ఎలా చెపుతావ్ ?'

'ఇలా చెపుతా' మళ్ళీ సౌంజ్ఞలు చేసింది పార్వతమ్మ.

"వద్దని చెపుతావా, సరేలే. మరి ఏది కావాలో ఎలా చెపుతావే ?" మరొక ప్రశ్న.

పాపం ! పార్వతమ్మగారికి సమాధానం దొరక లేదు. మౌనంగా వుండిపోయింది —

"వూరుకోండే మరీ చిన్నపిల్లని చేసి మాట్లాడుతున్నారు" సువర్చల పిల్లలని కోప్పడింది.

పార్వతమ్మగారికి ఏం పాలు పోవటంలేదు. తను ఎంత పొరపాటుచేసింది ? తన కూతురు యిల్లంతా వెస్టరన్‌స్టైల్లో వుంటుంది. పిల్లలంతా కాన్వెంటు విద్యార్థులే. తనే ఓ సంవత్సరం ముందు నుంచి, వాళ్లదగ్గర నేర్చుకొని వుంటే, ఈపాటికి తనూ ఇంగ్లీషు మాట్లాడగలిగేది. అథమం తనకేమి కావాలో అక్కర్లేదో చెప్పగలిగి వుండేది తనకి ముందుచూపు లేకుండా పోయింది.

పార్వతమ్మగారికి పట్టుదల ఎక్కువయింది. ఎలాగైనా అమెరికా ప్రయాణం చేసి తీరాలి. తోడు వున్నా లేకపోయినా, ఇంగ్లీషు వచ్చినా రాకపోయినా, ఈ ప్రయాణం జరిగి తీరాలి. ఆలోచనలు మొదలు పెట్టింది. జీవితంలో ఎన్నో సాధించింది. బ్రతుకు మధ్యలో భర్త పోయినా, ఆస్తులు కాపాడుకుంటూ వచ్చి, పిల్లలని పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేసింది. ఇప్పుడు పిల్లలందరూ చాల పెద్ద హోదాల్లో వున్నారు. అటువంటి తనకు యీరోజు అమెరికా ప్రయాణం ఓ సమస్యగా వుంది.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుని అడిగింది.

"ఏరా కుమార్, బొంబాయిలో విమానం ఎక్కితే ఎక్కడా దిగి మారక్కరలేదుగా — తిన్నగా అమెరికాలోనే దిగవచ్చుగదా ?" అని.

"అంతే అమ్మమ్మా—ఎక్కడా మారక్కరలేదు. కానీ సుమారు ముప్ఫై గంటలు పైనే విమానంలో కూర్చోవాలి. పైగా విమాన ప్రయాణం పడకపోతే వాంతులు రావచ్చు. వాళ్ళని అడిగితే ఏదన్నా మందు యిస్తారు. కానీ నువ్వు అడగాలిగా—అందుకు ఇంగ్లీషు రావాలిగా ?" కుమార్ ప్రశ్నార్థకంగా సమాధానం చెప్పాడు.

"సరేలే — విమానంలో మనం ఏది అడిగినా యిస్తారుగా — తినడానికీ; తాగడానికీ డబ్బులు ఏమీ యివ్వక్కర్లేదుగా ?" మళ్ళీ అడిగింది.

"అన్నీ యిస్తారు అమ్మమ్మా — దగ్గరవుండి టాయ్‌లెట్‌కి తీసుకొని వెళ్ళమన్నా తీసుకువెడుతుంది హోస్టెస్. కాని వచ్చిన చిక్కల్లా నువ్వు ఇంగ్లీషులోనే అడగాలి."

"ఉహూ — " పార్వతమ్మ ఇంక ఏమీ అడక్కుండా భోంచేయడం ఆరంభించింది.

ఆ రాత్రి పార్వతమ్మగారికి కంటిమీద కునుకు లేదు. తను విమానం ఎక్కినట్లు — ఆకలేసినట్లు— అన్నం కోసం సంజ్ఞలు చేసినట్లు — వాళ్ళు ఏదేదో పెట్టినట్లు — తనకి వాంతి అయినట్లు — అందరూ విదలించి చూసినట్లు — మధ్యలో తనని ఎక్కడో దింపేసినట్లు — విచిత్రంగా ఊహలు రాసాగాయ్.

తెల్లవారింది — పార్వతమ్మ చకచక తన పనులు చేసుకుంటోంది. చాల హుషారుగావుంది. ఎవ్వరికీ ఏమీ అర్థం కాలేదు.

"బామ్మా — టిక్కెట్టు కాన్సిల్ చేయనా ?" కుమార్ ఆఫీసుకు వెడుతూ అడిగాడు.

"రెండు రోజులు ఆగరా, చెపుతా" పార్వతమ్మ చెప్పింది నవ్వుతూ —

కుమార్ మరేం అడక్కుండా వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం తన గదిలో కాన్వెంట్‌లో సెవెన్త్ చదువుతున్న మనుమరాలితో తలుపులు వేసుకొని కూర్చుంది, పార్వతమ్మ. గుసగుసలూ, నవ్వులూ — ఎవ్వరికీ ఏమీ అర్థంకాలేదు; వాళ్ళు ఏమిచేస్తున్నారో. సాయంత్రం ఏడుగంటలకి తలుపులు తెరుచుకున్నాయ్. పార్వతమ్మా మనుమరాలూ అలసిపోయిన మొహాలతో బయటకు వచ్చారు.

రాత్రి డైనింగ్ టేబులు దగ్గర పార్వతమ్మ చాల హుషారుగా వుంది.

"నా ప్రయాణం గురించి నా నిర్ణయం చెపుతున్నానురా" పార్వతమ్మ ప్రకటించింది. అందరూ ఆమెకేసి ఆసక్తిగా చూశారు, ఏం చెపుతుందోనని.

"నేను ఒక్కర్తినే అమెరికా ప్రయాణం చేస్తున్నా" పార్వతమ్మ నిశ్చలంగా చెప్పింది.

విన్నవాళ్ళు అదిరిపడ్డారు. మళ్ళీ అదేఅంది.

"కుమార్‌వచ్చి నన్ను బొంబాయిలో విమానం ఎక్కిస్తాడు. బొంబాయివరకూ ఇద్దరం యిక్కడ నుంచి విమానంలో వెడతాం—అమెరికాలో వాళ్ళు రిసీవ్ చేసుకుంటారు."

"కానీ మామ్మా — రోజున్నర ప్రయాణం— మధ్యలో ఏదన్నా కావలసివస్తే ఎలా" కుమార్ సంశయంగా అడిగాడు.

## ఆడపిల్లల పట్ల చిన్న చూపు!

ఆడపిల్లలు చదువుల్లో వెనుకబడి ఉండటానికి కారణం ఏమిటి ? ఉపాధ్యాయుల నుండి, తలితండ్రుల నుండి సరైన ప్రోత్సాహం లభించకపోవటం వల్లనే ఆడపిల్లలు చదువుల్లో వెనుకబడి ఉంటున్నారని పశ్చిమ జర్మనీలో ఈ విషయమై ప్రత్యేక పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనల్లో 35 మంది ఉపాధ్యాయులను,సుమారు వెయ్యి మంది విద్యార్థులను పరిశీలించారు. ఈ పరిశోధనల రహస్యం వారికి తెలియనివ్వలేదు. పాఠాలు చెప్పేటప్పుడు ఉపాధ్యాయులు ఎక్కువగా మగపిల్లలవైపే శ్రద్ధ చూపుతున్నారు. పొగడ్తలు, తిట్లుకూడా ఎక్కువగా మగపిల్లలకే లభిస్తున్నాయి. విరామ సమయంలో కూడా వీరు ఎక్కువగా మగపిల్లలతోనే మాట్లాడుతున్నారు. ఈ రకంగా ఆడపిల్లలను చిన్నచూపు చూస్తున్నారని ఈ పరిశోధనల్లో తేలింది.

## బామ్మగారి....ప్రయాణం

"అవన్నీ నేను చూసుకోగలను" ఆవిడ సమాధానం చాల నిబ్బరంగావుంది. అందులోని అర్థం ఆవిడమనుమరాలి ఒక్కర్తికే తెల్సు.

మర్నాడే ఓవర్‌సీస్ కాల్ బుక్‌చేసి, కుమార్ మేనమామలకు, పార్వతమ్మగారి ప్రయాణంగురించి చెప్పాడు. ఒక్కర్తే వస్తోందని విన్నవాళ్ళు ఖంగారు పడ్డారు. కాని పార్వతమ్మగారు తన నిర్ణయం మారదంది.

అనుకున్న ప్రకారం పార్వతమ్మగారిని బొంబాయిలో ప్లేనుఎక్కించాడు కుమార్, జాగ్రత్తలు చెపుతూ— పార్వతమ్మగారు నవ్వేసింది, తన బ్రీఫ్‌కేస్ పదిలంగాపట్టుకొని. కుమార్ మళ్ళీ కాల్ బుక్‌చేసి చెప్పాడు, ఏర్‌పోర్టుకి తప్పకరమ్మనమని.

అమెరికాలో బ్రీఫ్‌పట్టుకొని విమానందిగుతున్న పార్వతమ్మగారిని చూసిన కొడుకు రవికి మనసు కుదుటపడింది.

"అమ్మా విమానంలో చాలయిబ్బంది పడి వుంటావ్—ఏం బాధ పడ్డావో ఏమో ?" రవి చాల ఓదార్పుగా అన్నాడు. పార్వతమ్మనవ్వింది. "ఏం యిబ్బందీ పడలేదురా. నాకు కావలసినవన్నీ అడిగి చేయించుకున్నా, పాపం ఆ అమెరికన్ ఆడపిల్లలు (హోస్టెసెస్) చాల మంచివాళ్ళురా." పార్వతమ్మ ఎయిర్‌హోస్టెసెస్‌కు కాంప్లిమెంట్లు చెప్పింది.

"నీవు ఇంగ్లీషు నేర్చుకున్నావా ?" రవి చాల ఆశ్చర్యంగా అడిగాడు.

"నాకు యింగ్లీషు రావటంకూడానా ?" పార్వతమ్మ మాటల్లో కొడుక్కి సమాధానం దొరకలేదు.

"మరి వాళ్ళని ఎలా అడిగావమ్మా ?"

"ఇలా అడిగా" బ్రీఫ్‌కేస్ కేసి చూపిస్తూ చెప్పింది. రవికి ఏదీ అర్థంకాలేదు.

పార్వతమ్మ బ్రీఫ్ తెరిచింది. దాన్నిండా అట్ట ముక్కలు సిగరెట్టుపెట్టె సైజులో వున్నాయ్ — సుమారు నూరూ నూటయాభై వరకు వున్నాయ్.

"ఏమిటమ్మా యివి ?" రవికి ఇంకా ఏమీ బోధపడలేదు.

పార్వతమ్మగారు గర్వంగా నవ్వింది.

"చెప్తా విను —నాకు కాఫీ కావాలి. అందులో పంచదార వుండకూడదు. ఆ పిల్లని ఇంగ్లీషులో అడగాలి. ఎలా అడిగానో తెల్సా... ఇలా... అడిగా" పార్వతమ్మ ఓ అట్టముక్క వెతికి తీసింది.

ఆ అట్టముక్కమీద ఒకవైపు తెలుగులో రాసి వుంది — 'నాకు కాఫీ కావాలి; పంచదార మాత్రం వేయవద్దు' అని. రెండవవైపు తిప్పింది 'ఐ వాంట్ కాఫీ బట్ విత్ అవుట్ షుగర్' అని వ్రాసివుంది. పార్వతమ్మ యింకో అట్ట తీసింది.' "నేను టాయ్‌లెట్‌కి వెళ్ళాలి. దయచేసి దగ్గరవుండి తీసుకొని వెళ్ళవలసినదిగా కోరుచున్నా !" అని ఒకవైపు తెలుగులో వ్రాసివుంది. వెనకవైపు "ప్లీజ్ హెల్ప్‌మి టూది టాయిలెట్" అని వ్రాసివుంది.

రవికి వాటిని చూస్తూంటే ఆశ్చర్యంవేసింది. గబగబా మిగతావాటిని తీసి చదవటం మొదలెట్టాడు. విమానం ఎక్కిన దగ్గరనుంచి దిగే వరకూ, ఎదురయ్యే అన్ని సమస్యలకీ తర్జుమాలు ఇంగ్లీషులో వ్రాసివున్నాయ్.

"బెల్టు పెట్టుకోలేకపోతున్నా, దయచేసి సహాయం చేయండి, వికారంగావుంది, శాకాహార భోజనమే కావాలి, గుడ్లు వద్దు" వగయిరా.

పార్వతమ్మ మొహం గర్వంతో వెలుగుతోంది.

"నేను ఎయిర్‌పోర్టుకి రాకపోతే ఏంచేసేదానివే అమ్మా ?" రవి కొంటెగా అడిగాడు.

పార్వతమ్మ చిరునవ్వు నవ్వింది. బ్రీఫ్‌కేస్ తెరిచింది. పాకెట్ నుంచి ఎర్రటి పెద్ద సైజు అట్ట తీసింది. అందులో ఒకవైపు తెలుగులోవుంది.

"నేను యిండియా నుండి వంటరిగా వచ్చా. అమెరికా నాకు కొత్త. ఇంగ్లీషు భాష నాకు రాదు. మా అబ్బాయి ఎయిర్‌పోర్టుకు వస్తానని రాలేదు. దయచేసి యీ నెంబరుకు ఫోనుచేసి, వారి అమ్మగారు వచ్చినారనీ, వెంటనే రమ్మని కబురుచేయండి. వీలయితే అక్కడకు తీసుకొని వెళ్ళండి" అనివుంది. వెనక్కి తిప్పి చూస్తే దానికి యింగ్లీషు తర్జుమా, అందులో రవి ఫోను నెంబరూ, ఇంటి అడ్రసూ వున్నాయ్.

రవి ఆశ్చర్యానికి అంతులేదు.

"అమ్మా! నువ్వే కనుక రాజకీయాల్లోదిగితే, ప్రైమినిస్టరువి నువ్వే అయ్యేదానివే" అంటూ తల్లిచేతులు ఆపేక్షగా పట్టుకున్నాడు రవి. ★

**కృతజ్ఞతలు**

ఈ కథకు ఐడియా యిచ్చిన మిత్రుడు దూర్వాసుల చంటి (పెద్దాపురం) గార్కి కృతజ్ఞతలు—

— 'అమంతా'